సాక్షి బాపట్ల

గురువారం । 31 । అక్టోబర్ । 2024



శివాలయంలో చండీ హోమం

కొల్లిపర: స్థానిక ప్రసిద్ధ శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం చండీ హోమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పోలీస్ అమరవీరులకు నివాళులు

మేడికొండూరు: పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా పేరేచర్ల జంక్షన్‌లో బుధవారం రాత్రి శ్రద్ధాంజలి ఘటించారు. సీఐ మీరా సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



నకరికల్లు: నర్సింగపాడులో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో మాసశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుడికి రూ.49,93,142 ఆదాయం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం హుండీల ద్వారా రూ.49,93,142 ఆదాయం లభించినట్లు ఈవో దాసరి చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ హుండీల లెక్కింపు బుధవారం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 104రోజులకు హుండీల ద్వారా రూ.45,40,704, అన్నదాన హుండీ ద్వారా రూ.4,52,438 ఆదాయం లభించినట్లు వివరించారు. హుండీ లెక్కింపులో భక్త సమాజం ప్రతినిధులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లేరు వాగులోకి దూసుకెళ్లిన టిప్పర్



మాచవరం: మండలంలోని నాగేశ్వరపురం తండా సమీపంలోని పిల్లేరు వాగులోకి టిప్పర్ దూసుకెళ్లిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నాలుగు రోజులుగా చప్టాపై నీరు పారుదల ఆగిపోయింది. ఈ మార్గాన ఇసుక లారీలు, ట్రిప్పర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. నాగేశ్వరపురం వైపు నుంచి బెల్లంకొండ మండలానికి వెళుతున్న టిప్పర్ మూల మలుపు వద్ద అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పిడుగుపాటుకు రైతు మృతి



అంబడిపూడి(క్రోసూరు): అచ్చంపేట మండలంలోని అంబడిపూడిలో బుధవారం పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు కూనిసెట్టి నారాయణ(35) పత్తి పొలంలో పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, సమీపంలో పిడుగు పడి మృతి చెందాడు. పక్క పొలంలోని కూలీలు చూసి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతుడికి భార్య , ఇద్దరు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

నేలకొరిగిన భారీ వృక్షం



సత్తెనపల్లి: గాలి, వర్షం కారణంగా బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలోని భారీ చింత చెట్టు కూలింది. పెద్ద పెద్ద కొమ్మలు కార్యాలయ ప్రహరీ గోడ మీద నుంచి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గోడను ఆనుకుని ఉన్న టీ, స్టాంప్‌ల విక్రయ దుకాణంతో పాటు ద్విచక్ర వాహనంపై కూడా కొమ్మలు పడటంతో అవి ధ్వంసం అయ్యాయి. నిత్యం స్టాంపు వెండర్లు, భూముల కొనుగోలు, అమ్మకందారులు, కోర్టుకు వచ్చే కక్షిదారులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. అయితే, ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. పట్టణ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చింతచెట్టు కొమ్మలను తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

మిర్చి యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా భార్గవ్ తేజ బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా యార్డు ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యార్డులో పర్యటించారు. క్రయవిక్రయాల తీరు, ప్రస్తుతం మిర్చి ధరలు, బిడ్డింగ్ విధానం, రైతులకు గిట్టుబాటు ధర లభ్యత తదితరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. మిర్చి కమీషన్ షాపులు, రైతు విశ్రాంతి భవనం, ఉచిత భోజన శాల, ఇతర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా భార్గవ్ తేజ మాట్లాడుతూ.. రాబోవు మిర్చి సీజన్ నాటికి యార్డులో పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

ఉచితం పేరుతో అనుచితం


- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- పచ్చ నేతలకు కాసుల పంట
- అధికారుల సహకారం
- ప్రభుత్వ, ఆటవీ, సముద్రతీర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తవ్వకాలు

ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఉచితం పేరుతో ప్రజల్ని జలగల్లా పిండేస్తున్నారు. కనీస అనుమతులు లేకుండా రోజుకు వందల ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. చివరకు ప్రభుత్వం, ఆటవీ భూములు, స్ట్రయిట్ కట్ కాలవల కరకట్టలు, సముద్రతీరం ప్రాంతాల భూములనూ వదలడం లేదు. ఉచితం పేరుతో ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వులను అడ్డు పెట్టుకొని పచ్చనేతలు అడ్డుగోలుగా భారీస్థాయిలో ఇసుక వ్యాపారం చేస్తున్నారు. – చీరాల



అసైన్డ్ భూముల్లో పొక్లెయిన్‌తో ఇసుక అక్రమ తవ్వకాలు

నదీ పరీవాహక ప్రాంతాల నుంచి ప్రజల సొంత అవసరాల కోసం ఇసుక ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే, దీన్ని అడ్డు పెట్టుకొని పచ్చ నేతలు దోపిడీకి తెరతీశారు. చీరాల, పర్చూరు నియోజ కవర్గాల ప్రాంతాల్లో వందల ఎకరాల్లో అక్రమంగా ఇసుక తవ్వుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ, అసైన్డ్ భూములు, సముద్రతీరం వెంట ఉన్న అటవీ భూముల్లో తవ్వేసి వందల ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల్లో కేవలం వివిధ పంటలు సాగు చేసుకోవడం కోసం సంబంధిత యజమానులకు పట్టా ఇస్తుంది. కానీ ఈ భూముల్లో ఉన్న ఇసుకను పచ్చ నేతలు అక్రమంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఇసుక భూముల నుంచి ఇసుక తరలించాలంటే తహసీల్దార్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ అటువంటి నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. అధికారులు కూడా అటువైపుగా దృష్టి సారించడం లేదు.



అసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వగా ఏర్పడిన గుంతలు

ఇసుక విక్రయాల్లోనూ పచ్చనేతల దందా

చీరాల నియోజకవర్గ పరిధిలో ఇసుక విక్రయాల్లోనూ పచ్చనేతల దందా కొనసాగుతోంది. ఇసుక ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ వారి తాలూకా హైదరాబాద్ గ్యాంగ్ దందా నడుపుతోంది. భూమి యజమానిని నయానో భయానో బెదిరించి తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. అక్కడ తమ సిబ్బందిని ఉంచి దందా కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ రూ. 1800 నుంచి రూ. 2000 వేలకు విక్రయిస్తున్నారు. చీరాల, వేటపాలెం ప్రాంతాల్లోని భూముల్లో నాణ్యమైన ఇసుక లభించడంతో మార్టూరు, పర్చూరు, అద్దంకి దూర ప్రాంతాల నుంచి వంద సంఖ్యలో ట్రాక్టర్లు తీసుకొచ్చి ఇక్కడ నుంచి తరలించుకెళుతున్నారు. ప్రతి రోజూ బైపాస్ రోడ్డుపై వందల సంఖ్యలో ట్రాక్టర్లు కన్పిస్తున్నాయి.

ఇసుక విక్రయాల్లో పోటీ

ప్రైవేటు, అసైన్డ్ ఇసుక భూములున్న యజమానులు కూడా అమ్మకాలు ప్రారంభించారు. ఇంకో వైపు స్థానిక పచ్చనేత అనుచరులు కూడా వ్యాపారం చేస్తుండటంతో పోటీలు ప్రారంభమయ్యాయి. దీంతో ఇతరులు ఎవ్వరూ అమ్మడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. ఒకవేళ తరలిస్తే వెంటనే రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్కడ వాలిపోతారు. ఇసుక తరలించడానికి అనుమతులు లేవని వారిని నిలిపి వేస్తున్నారు. పచ్చనేతల అసైన్డ్ భూముల నుంచి వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నప్పటికీ అటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. దీంతో వారికి ఉచిత ఇసుక వరంగా మారింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు దృష్టి సారించి అసైన్డ్, అటవీ భూముల నుంచి ఇసుక తరలింపును అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.



ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక

కార్తిక పూజలకు వేళాయె..

పెదకాకాని శివాలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు





శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి



ఆలయంలో ఏర్పాట్లు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాస ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్తిక మాసం శుద్ధ పాడ్యమి నవంబర్ 2 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు ఉంటుంది. ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా నిత్యం ఉదయం మహన్యాస పూర్వక రుద్ర జప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నారు. పరోక్ష అభిషేక పథకాన్ని కూడా అధికారుల ప్రవేశపెట్టారు. రూ. 2,000 చెల్లించిన వారికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపించనున్నారు. నవంబర్ 26న భక్తులతో సామూహిక లక్ష బిల్వార్చన ఉంటుంది. నవంబరు 29న మాస శివరాత్రి రోజు పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజలు జరిపించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. భక్తులు ఇబ్బంది పడకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసు, అగ్నిమాపక, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కార్తిక పౌర్ణమి నాడు కోటి దీపోత్సవం ఉంటుందని చెప్పారు. పర్వదినాల్లో ప్రత్యేక పూల అలంకారం, విద్యుద్దీపాల అలంకరణ ఉంటుందని వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అమరేశ్వరాలయం ముస్తాబు

అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయం కార్తిక మాసోత్సవాలకు ముస్తాబవుతోంది. సామాన్య భక్తులతో పాటు పంచారామ యాత్రికులకు స్వామి దర్శనం త్వరితగతిన జరిగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన దేవాలయంలో చేసిన ప్రత్యేక ఏర్పాట్ల గురించి వివరించారు. నవంబరు 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్తిక మాసంలో భక్తులకు వసతి, ఉచిత దర్శనం, ప్రసాదం, పరిమిత స్థాయిలో అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్నాన ఘట్టాలలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బందిని పెంచి ఆలయ పరిశుభ్రంగా ఉంచుతామని చెప్పారు.



జీ హుజూర్

- పచ్చ నేతలు చెప్పినట్లు అధికారులు
- మొన్న టీడీపీ కార్యాలయాల్లో ప్రజాదర్బార్
- నిబంధనలకు పాతరేసి హాజరైన అధికారులు
- నిన్న టీడీపీ నేత చేతుల మీదుగా టపాసుల దుకాణాల లాటరీ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కొందరు ప్రభుత్వ అధికారులు మరింత బరి తెగించారు. పచ్చపార్టీ నేతలు చెప్పిందానికి గంగిరెద్దుల్లా తలలూపుతున్నారు. వారి ప్రాపకం కోసం జీ హుజూర్ అంటున్నారు. మొన్నటికి మొన్న ప్రజాదర్బార్‌ను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఏకంగా టీడీపీ కార్యాలయాల్లోని వేదిక మీద నిర్వహించగా అధికారులు ఏ మాత్రం జంకు లేకుండా హాజరయ్యారు. ఇది పార్టీ కార్యక్రమం కాదని, ప్రభుత్వ కార్యక్రమం అని తెలిసినా ఏ మాత్రం ఖాతరు చేయని ఎమ్మెల్యే పచ్చపార్టీ కార్యాలయంలో టీడీపీ ఫ్లెక్సీలు బ్యాక్‌గ్రౌండ్‌గా ఉన్న వేదిక మీదనే ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌తో పాటు ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీదేవి, విద్యుత్‌శాఖ అధికారి శ్రీనివాసరావు తదితర కీలక శాఖల అధికారులు పాల్గొన్నారు. రెండవ రోజు కూడా ఇదే కార్యాలయంలో ఎమ్మెల్యే నిర్వహించారు. ఆ తర్వాత కర్లపాలెం మండలంలో టీడీపీ కార్యాలయంలోనే ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించగా అప్పటి తహసీల్దారు వెంకటరత్నం, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు తోపాటు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తల్లా వినతులు స్వీకరించాల్సి వచ్చింది. ఎమ్మెల్యే వర్మ అధికారిక కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా నిర్వహించడం అటు పార్టీ ఇటు అధికార వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అధికారులు హాజరు కావడాన్ని పలువురు ప్రభుత్వ అధికారులే తప్పుబట్టారు. దీనిపై స్వపక్షం నుంచే టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు లందాయి.



బాపట్ల జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజా దర్బార్‌లో అధికారులు (ఫైల్)



బాణసంచా దుకాణాల లక్కీ డ్రాను టీడీపీ నేతల చేతుల మీదుగా నిర్వహిస్తున్న అధికారులు

పచ్చ నేతల చేతుల మీదుగా అధికారిక కార్యక్రమాలు

తాజాగా దీపావళి పండుగ నేపథ్యంలో బాపట్లలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన లక్కీ డ్రాలో అధికారులు వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. దుకాణాల కోసం 35 మంది దరఖాస్తులు చేసుకోగా మంగళవారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో లక్కీడ్రా తీశారు. అధికారులు మాత్రమే నిర్వహించాల్సి ఉండగా, పాలకుల మెప్పుకోసం టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు చేతుల మీదుగా నిర్వహించడం విమర్శలకు దారి తీసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు, పట్టణ సీఐ అహ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు. ఒక్క బాపట్లలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా చాలామంది అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పచ్చపార్టీ నేతల ఆదేశాలను మాత్రమే అమలు చేస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి.



ఆర్చరీ క్రీడాకారిణికి సత్కారం

తాడేపల్లిరూరల్ : అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖను కుంచనపల్లిలోని ఆమె నివాసంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాద పూర్వకంగా ఆమెను కలసి శాలువాతో సత్కరించి, పూలమొక్క అందజేశారు. ఆర్చరీలో మరిన్ని పతకాలు సాధించాలని రవి కుమార్ నాయుడు అన్నారు.

పవిత్ర కార్తికానికి మోర్తోట ముస్తాబు

ముక్తేశ్వరుని ఆలయంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి దేవాలయం



ముక్తేశ్వరస్వామి



పార్వతి అమ్మవారు

రేపల్లె రూరల్: నియోజకవర్గంలోని శైవాలయాలు, విష్ణాలయాలు పవిత్ర కార్తిక మాసానికి ముస్తాబయ్యాయి. నవంబర్ 2వ తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆలయాలకు వచ్చే భక్తులకు కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయం, అరవపల్లిలోని బాలకోటేశ్వరస్వామి దేవాలయం, చోడాయపాలెంలోని చొడేశ్వరస్వామి ఆలయం, పెనుమూడిలోని శివాలయం, రామాలయంతో పాటు పట్టణంలోని పలు శైవాలయాలు ఇప్పటికే అన్ని హంగులతో తీర్చిదిద్దారు. ముఖ్యంగా మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయం కృష్ణానది తీరంలో ఉంది. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో ఆలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

మోర్తోట స్థల పురాణం

కృష్ణమ్మ తీరాన వెలసిన మోర్తోట శ్రీముక్తేశ్వర స్వామి దేవాలయం ప్రసిద్ధి చెందింది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆలయ చరిత్రపై స్థానికులు కథలు కథలుగా చెప్పుకొంటుంటారు. పూర్వం హిమాలయ పర్వత రాజ్యంలో జ్ఞానముని, సుచరిత దంపతులకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏకమూర్తిగా 'త్రినాథుడు' జన్మించాడు. ఐదో ఏట నుంచే అతడు వేద పాఠశాలలో చదువుకుంటున్నాడు. రావణాసురుడి వంశానికి చెందిన రాకాశి అనే రాక్షసి తన శరీరాన్ని ఆకాశపు హద్దు వరకు పెంచి, పూజా కార్యక్రమాలలో నిమగ్నమైన మునులపై తన నోటితో గాలిని ఊదింది. అది పెద్ద గాలిగా మారడంతో మునులందరూ చెల్లాచెదురయ్యారు. త్రినాథుడిని తన భుజాన వేసుకొని వాయు వేగాన హిమాలయాల నుంచి దక్షిణాన ఉన్న ఉన్న మోర్తోట గ్రామానికి తీసుకొచ్చింది. రోదిస్తున్న తల్లిదండ్రులను చూసిన త్రిమూర్తులు ఓదార్చారు. కారణ జన్ముడైన త్రినాథుడు ముక్తిని పొందబోతున్నాడని చెప్పారు. రాకాశి త్రినాథుడి శిరస్సును కొరికి వేసి కృష్ణానది తీరం వెంబడి విసిరివేయగా దాన్నుంచి లింగోద్భవమైంది. దానికి త్రిమూర్తులు స్వయంభూ లింగమైన లింగాకారానికి ముక్తేశ్వరుడని నామకరణం చేశారు. త్రినాథుడు ముక్తిని పొందిన ప్రదేశం కాబట్టి మోర్తోటగా మారింది. మిగిలిన శరీరాన్ని రాకాశి ఉత్తర భారతదేశంలో పడవేయగా గంగా నది తీరంలో పడి లింగాకారాన్ని పొందింది. దీంతో ఆ ప్రాంతం రాకాశి పేరు మీదగానే కాశీ అని నామకరణం పొందింది. అనంతరం త్రిమూర్తులు ఆ రాకాశిని సంహరించారు. దీంతో నాటి నుంచి మోర్తోట దక్షిణ కాశీగా పేరు గాంచింది. ముక్తిని అందించే ముక్తేశ్వరస్వామి నాటి నుంచి భక్తుల పూజలు అందుకుంటున్నాడు.

జాతి ఐక్యతకు పునాదులు వేసిన పటేల్



పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: జాతి ఐక్యతకు పునాదులు వేసిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి కొనియాడారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పటేల్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రజలంతా సోదరభావం, ఐక్యతతో మెలగాలంటూ చెయ్యి చెయ్యి పట్టుకుని మానవహారం నిర్వహించారు. అనంతరం జాతి ఐక్యతపై విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. దాస్య శృంఖలాలలో చిక్కుకుని సంక్షోభంలో ఉన్న భారత దేశానికి స్వాతంత్రం కావాలని భగత్ సింగ్, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులు ఎన్నో ఉద్యమాలు చేశారని తెలిపారు. స్వాతంత్రం ఇచ్చినట్లు బ్రిటిష్ వారు ప్రకటించినప్పటికీ 500 సంస్థానాలకు అధికారాలు ఇవ్వడంతో ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. సంస్థానాలపై సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని ఉక్కుమనిషిగా సైనిక చర్యలతో జాతి ఐక్యతకు పటేల్ బాటలు వేశారని తెలిపారు. ఆయన చూపిన ఐక్యతా మార్గంలో భారత్ నడుస్తూ ప్రపంచ దేశాల సరసన ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఏర్పడిందని పేర్కొన్నారు. జాతి మొత్తం ఐక్యతతో మెలగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె. పాల్‌కుమార్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

- ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు
- ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలి

నరసరావుపేట టౌన్: బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా బెల్ట్ షాపులు నిర్వహించకూడదని, పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసిన దుకాణం లైసెన్స్‌ను కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. దుకాణాల్లో సీసీ కెమెరాలతో పాటు ధరల పట్టికను ప్రదర్శించాలని తెలిపారు. జిల్లాలో 11 ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాల్ని గుర్తించామని పేర్కొన్నారు. నాటుసారా తయారీదారులతో పాటు, ఇతర రాష్ట్రాల మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ పెడతామని ఎస్పీ స్పష్టంచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై మంగళవారం నుంచి దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలు దాడులు జరిపి కేసులు నమోదు చేస్తున్నాయని వెల్లడించారు. రెండు రోజుల్లో 14 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఈఎస్ మణికంఠ, ఏఈఎస్ రవీంద్ర, సీఐ సోమయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీ దీపావళి పండుగ శుభాకాంక్షలు

బాపట్ల: బాపట్ల జిల్లా ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి బుధవారం ఒక ప్రకటనలో దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 'చెడు మీద మంచి', 'దుష్టశక్తుల మీద దైవ శక్తి' సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పర్వదినం జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ప్రతి ఒక్కరూ విజయంవైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. సుఖ సంతోషాలు, సౌభాగ్యాలు, సంపదలు తీసుకురావాలని, అందరి జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

బాల్‌బాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు విద్యార్థిని ఎంపిక



నగరం: స్థానిక బాలయేసు స్కూల్‌కు చెందిన యార్లగడ్డ శివనందిని బాల్‌బాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సిస్టర్ సజ్వీ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. శివనందిని ఇటీవల శావల్యాపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట జట్టుకు ఎంపికైందన్నారు. బాలికను హెచ్‌ఎంతోపాటు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఎల్సిటామ్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వైపీ గోపయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కిల్ సెన్సెస్ సర్వేని వేగవంతం చేయాలి



బాపట్ల: స్కిల్ సెన్సెస్ సర్వే వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ సువార్త పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ స్కిల్ సెన్సెస్ సర్వేపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, న్యాక్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీరాల డీఎల్‌డీఓ పద్మావతి, రేపల్లె పద్మజ, గాయత్రి, పి.ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీ సుబ్బారావు



ప్రతిష్టించిన పోలేరమ్మ విగ్రహం

కర్లపాలెం: గ్రామదేవత పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట బుధవారం నక్కలవానిపాలెంలో వైభవంగా జరిగింది. గ్రామపెద్దల ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహంతోపాటు ఆలయం ఎదురుగా పోతురాజుస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, సర్పంచ్‌లు యల్లావుల సురేష్‌యాదవ్, దేవరకొండ అంకమ్మ, దబ్బకూటి ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మూడు రోజులుగా కారంచేడు దక్షణామూర్తి బృందం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలకు జలాదివాసం, ధాన్యాదివాసం, శాంతి హోమాలు నిర్వహించి, విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పందరబోయిన శ్రీనివాసరావు, మిద్దిబోయిన శంకర్, పి.చినవెంకటరావు, కొండేపి గోపి, పి.బాలాజీ, బాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రతిష్ట అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయం వద్ద ప్రదర్శించిన మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

పోలీసు జీపు ఢీకొని వృద్ధురాలు మృతి



అనసూర్యమ్మ మృతదేహం

పెదకాకాని: పోలీసు జీపు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. పాతగుంటూరుకు చెందిన సుంగారపు అనసూర్యమ్మ తన కుమార్తె వివాహం అనంతరం నివాసం ఉంటున్న ఇల్లు విక్రయించింది. సుమారు 20 ఏళ్లుగా పెదకాకాని శివాలయం వద్దనే ఉంటూ జీవనం సాగిస్తోంది. నవంబరు 2వ తేదీ నుంచి పెదకాకాని శివాలయంలో కార్తికమాసం పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు పెదకాకాని సీఐ టి. నారాయణస్వామి బుధవారం శివాలయానికి వచ్చారు. ఆ సమయంలో జీపు డ్రైవర్‌గా ఉన్న హోంగార్డు షేక్ ఆజీజ్ జీపును రివర్స్ చేస్తూ భక్తులు తలనీలాలు సమర్పించే గది ప్రహరీని ఢీకొట్టాడు. గోడపై తలనీలాలు గది నిర్మించిన దాతల పేర్లతో కూడిన శిలాఫలకం ఉంది. ఆ దిమ్మె కూలి వెనక్కి పడింది. ఆ సమయంలో గోడ పక్కనే దుస్తులు ఆరవేస్తున్న అనసూర్యమ్మ చేయిపై శిలాఫలకం పడటంతో చెయ్యి నుజ్జు నుజ్జు అయి రక్తస్రావం అయింది. బాధితురాలిని వెంటనే అదే పోలీసు జీపులో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అనసూర్యమ్మ(71) మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మనుమడు గద్దె వెంకటసురేష్‌బాబు ఫిర్యాదు మేరకు జీపు డ్రైవర్ షేక్ ఆజీజ్ పై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ టి.నారాయణస్వామి తెలిపారు.

ప్రభుత్వ లేఅవుట్లలో మార్చిలోగా ఇళ్ల నిర్మాణం



మాట్లాడుతున్న పీడీ జీవీవీ ప్రసాద్

తెనాలి: ప్రభుత్వ లేఅవుట్లలో వచ్చే ఏడాది మార్చిలోగా తొలి విడత ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీవీ ప్రసాద్ కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం సాయంత్రం గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ ఉద్యోగులు, సచివాలయాల్లోని ఎమినిటీస్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు అందరూ ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యాంశంగా తీసుకుందన్నారు. జిల్లాస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో వంద రోజుల ప్రణాళిక కోసం పని చేస్తున్నట్టు తెలిపారు. దిగువస్థాయిలో గృహనిర్మాణ సంస్థ అధికారులు, సచివాలయాల ఎమినిటీస్ కార్యదర్శులు కూడా సమష్టిగా పనిచేసి, లక్ష్యాన్ని సాధించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, గృహనిర్మాణ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు భాస్కరరావు, డీఈఈ రఫీవుల్లాఖాన్, ఏఈ పిచ్చయ్య పాల్గొన్నారు.

షటిల్‌లో సత్తా చాటిన షేక్ న్యూమేర్



చీరాల రూరల్ : చీరాలకు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు షేక్ న్యూమేర్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటాడు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ పోటీలు జరిగాయి. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీకి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆ జట్టులో చీరాలకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు షేక్ న్యూమేర్ ఆడాడు. అతడు రాణించడంతో చెన్నై జట్టుపై అమరావతి ఎస్ఆర్ఎం జట్టు 3-2 తేడాతో విజయకేతనం ఎగురవేసింది. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ సాధించింది. సౌత్‌జోన్ ఉన్న రాష్ట్రాలకు చెందిన 136 వర్సిటీల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి

మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను డీఈవోజీఎన్‌టీబ్లాగ్ స్పాట్.ఇన్ సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఉంటే నవంబర్ ఒకటో తేదీన డీఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలన్నారు.

మెనూ పాటించకుంటే క్రిమినల్ చర్యలు

- హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాళ్లను హెచ్చరించిన కలెక్టర్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

నరసరావుపేట: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో నిబంధనల మేరకు మెనూ పాటించాలని, అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ, క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక, వెనుబడిన తరగతులు, గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సంబంధిత హాస్టల వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నిరంతర నీటి సరఫరా, పరిశుభ్రత, ఫ్యాన్లు, వెలుతురు సరిగా ఉండేలా లైటింగ్ ఉండాలన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులచే పనులు చేయించరాదన్నారు. బాలికల వసతి గృహాలలో ప్రహరీ, ఫెన్సింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతి గృహాలలో నైట్ వాచ్‌మెన్‌లు ఉండాలన్నారు. ప్లస్ టూ వసతి గృహాలలో నైట్ వాచ్‌మెన్‌లు విధిగా పరిస్థితులు గమనించాలన్నారు. వచ్చేనెల రెండో వారం నుంచి అధికారులతో కలసి వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణ మెరుగుపరచుకోవలసిన అవసరం ఉందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులు నాయుడు, వెనుకబడిన తరగతుల అధికారి నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖాధికారి వరలక్ష్మి, సంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాల జిల్లా అధికారి పద్మజ పాల్గొన్నారు.

కూటమి సమావేశంలో జనసేనకు అవమానం

- జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీని స్టేజ్‌పైకి పిలవని వైనం
- సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు
- తీవ్ర మనస్తాపంతో బయటకు వచ్చిన జిలానీ



సమావేశంలో మంత్రి గొట్టిపాటిని సన్మానిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు

నరసరావుపేట: టీడీపీ కూటమి నాయకుల సమావేశంలో స్థానిక జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానికి తీవ్ర అవమానం జరిగింది. దీనిపై జనసేన నాయకులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. వివరాలు.. పల్నాడు రోడ్డులో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం పల్నాడు జిల్లా కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు నియోజకవర్గంలోని ఏడుగురు టీడీపీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, టీడీపీ నాయకులు కోడెల శివరామ్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, కపలవాయి విజయకుమార్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారందరినీ స్టేజ్‌పైకి ఆహ్వానించారు. తనను స్టేజ్‌పైకి పిలవకపోవటంతో హాజరైన సయ్యద్‌జిలానీ అవమానానికి గురై సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. గత ఎన్నికల్లో కూటమి టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ విజయానికి సయ్యద్ జిలాని విశేష కృషి చేశారు. ఆయనను చూసి ముస్లిం మైనార్టీలు చాలామంది టీడీపీ వైపు మొగ్గారు. 2019లో జనసేన అభ్యర్థిగా ఒంటరిగా పోటీచేశారు. గత కొన్నిరోజులుగా అతనికి, స్థానిక ఎమ్మెల్యేకు సఖ్యత లేదు. ఎంపీ లావుతో సన్నిహితంగా ఉంటున్న జిలానీ స్థానిక ఎమ్మెల్యేకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల మద్యం దుకాణాల కేటాయింపులో జిలాని తన వర్గానికి ఒక షాపు అడిగినా టీడీపీ నాయకులు ఎవరూ పట్టించుకోలేదు. దేనిలోను జనసేనకు ప్రాధాన్యత ఇవ్వకపోవటంతో ఆయనతో పాటు ఆ పార్టీ వర్గీయులు అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు.

ఇన్‌చార్జి మంత్రికి సన్మానం..

కాగా, ఈ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు ఘనంగా సన్మానించారు. మాట్లాడిన వక్తలు వచ్చే నీటి సంఘాలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపించి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్‌టీఆర్, డాక్టర్ కోడెల విగ్రహాలకు నివాళులు అర్పించారు.

సేకరణతో కోల్పోనున్న భూముల పునఃపరిశీలన

రెంటచింతల: మండలంలో మాచర్ల - దాచేపల్లి బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్-167 ఏడీ) ఏర్పాటు వలన మండలంలో నర్సరీ నిర్వాహకులు కోల్పోయిన భూముల వివరాలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు జిల్లా ఉద్యానశాఖ అధికారి సీహెచ్ వి.రమణారెడ్డి నేతృత్వంలోని బృందం బుధవారం పునఃపరిశీలించారు. మండలంలోని పాలువాయి జంక్షన్, రెంటచింతల గ్రామాల పరిధిలో బైపాస్ రోడ్డుకోసం సేకరించిన ఏడుగురికి సంబంధించిన నర్సరీల భూములకు నష్టపరిహారం చెల్లింపు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఇప్పటికీ నర్సరీలు వినియోగంలో ఉన్నాయా.. ఉన్నా ఎందువలన నష్టపరిహారం చెల్లింపు నిలిచిపోయిందో వివరాలు సేకరించారు. షేడ్ నెట్ కొలతలను (ఎత్తు)బట్టి చదరపు అడుగుకు రూ. 560, రూ. 400, రూ. 260 పరిహారం భూములు కోల్పోయిన నర్సరీల నిర్వాహకులకు చెల్లించాల్సి ఉందని జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్ వి.రమణారెడ్డి తెలిపారు. నివేదికను కలెక్టర్ అరుణ్‌బాబుకు సమర్పించడం జరుగుతుందన్నారు.

రతన్‌టాటాకు సైకిల్ యాత్రికుడి ఘన నివాళులు

విశాఖ నుంచి కన్యాకుమారి వరకు సైకిలు యాత్ర



రేపల్లెకు చేరుకున్న బాలరాజు

రేపల్లె రూరల్: దేశానికి తన సేవలు అందించి పలువురికి ఆదర్శంగా నిలిచిన వ్యాపార దిగ్గజం, సేవా తత్పరుడు రతన్‌టాటాకు నివాళిగా ఓ యువకుడు సైకిలుయాత్రకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లో చేస్తున్న ప్రైవేటు ఉద్యోగానికి వీడ్కోలు పలికి యాత్రకు బయలుదేరారు. పార్వతీపురం మాన్యం జిల్లాలోని జిమ్మిడి జ్వాల గ్రామానికి చెందిన పొన్నాన బాలరాజు రతన్‌టాటా సేవలను పలువురికి తెలియజెప్పటంతోపాటు ఘన నివాళులు అర్పించాలన్న లక్ష్యంతో విశాఖపట్నం నుంచి కన్యాకుమారి వరకు సైకిలుయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన విశాఖపట్నం నుంచి సైకిలుయాత్రను ప్రారంభించి బుధవారం రేపల్లెకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఆ మహనీయుని సేవలను ప్రజలకు తెలియజేస్తూ 20 రోజుల్లో సైకిలు యాత్రను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రోజుకు 85 నుంచి 100 కిలోమీటర్ల వరకు వెళ్తున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో పెట్రోలు బంకులు, దేవాలయాలు, విద్యాలయాలలో బస చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికే ఇసుక



వాహనదారులకు సూచనలిస్తున్న రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి

కొల్లూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో నిబంధనలు వర్తిస్తాయని రేపల్లె ఆర్డీఓ ఎస్. రామలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గాజుల్లంక, జువ్వలపాలెం ప్రాంతాలలో ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లతోపాటు ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి పోలీసులు ఏర్పాటు చేయాల్సిన చెక్‌పోస్టు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న వాహనదారులకు పలు సూచనలు చేశారు. రవాణాదారులు ఇష్టానుసారం ఇసుక తరలింపు చేపట్టడం సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. అవసరమైన వ్యక్తులు ముందుగా ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని అన్నారు. వారు మాత్రమే ఇసుకను ఉచితంగా తరలించుకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. వినియోగించే వాహనాలు సైతం మైనింగ్ శాఖ వద్ద నమోదు చేసుకుని ఉండాలన్నారు. ప్రతి ట్రిప్పునకు జియో ట్యాగింగ్ ఉండాలని పేర్కొన్నారు. వాహనం ముందు ఉచిత ఇసుక రవాణా వాహనం అని బోర్డు ఉండాలని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైను ఇసుక కోసం గ్రామ సచివాలయాలలో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంలతో మోసగిస్తున్న ఎన్డీఏ

భారతీయ పార్టీల మూడవ కూటమి ఆరోపణ



లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రత్నం , నాయకులు

నెహ్రూనగర్: గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రధాన భాగస్వామిగా ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఈవీఎంలను అడ్డం పెట్టుకొని గెలుస్తోందని భారతీయ పార్టీల మూడవ కూటమి రాష్ట్ర అధ్యక్షుడు బూరుగ రత్నం ఆరోపించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కూటమి ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఈవీఎంలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ సేకరించిన 60 లక్షల ఈవీఎంలలో కేవలం 40 లక్షలు మాత్రమే ఆయా సందర్భాలలో వాడుతున్నారని చెప్పారు. మిగిలిన ఈవీఎంల గురించి సమాధానం రావట్లేదని విమర్శించారు. ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని వ్యవస్థలలో ఆర్ఎస్ఎస్ అజెండా అమలు చేసే వ్యక్తులకు ఉన్నత పదవులు కట్టబెట్టడం నియంతృత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యాధులు దీనిపై నిరసనను తెలియజేయాలని కోరారు. భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికలు ఈవీఎంల మాయాజాలంతోనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిచిందని ఆరోపించారు. భీమ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలను సాగనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు దొడ్డ రవీంద్ర, జయ కుమార్, బహుజన రాజకీయ జేఏసీ నాయకులు సాధు మాల్యాద్రి, నాయీ బ్రాహ్మణ జేఏసీ నాయకులు తాటికొండ నరసింహారావు, కృష్ణవేణి, రంగమ్మ, శ్రీవాణి, నాగమణి పాల్గొన్నారు.

ట్రామా వైద్య సేవలకు ప్రాధాన్యం

- గుంటూరు జీజీహెచ్ పూర్వ వైభవానికి కృషి
- సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ట్రామా వైద్య సేవలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ అన్నారు. ఏడు జిల్లాలకు చెందిన రోగులు, రోడ్డు ప్రమాద బాధితులు అత్యవసర చికిత్సల కోసం ఇక్కడికి వస్తుంటారని గుర్తుచేశారు. సకాలంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. జీజీహెచ్‌లో ట్రామా ఆపరేషన్ థియేటర్ సత్వర నిర్మాణానికి కృషి చేస్తానని వెల్లడించారు. బుధవారం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జీజీహెచ్‌కు పూర్వ వైభవానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలు వైద్య విభాగాలకు ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.

అండర్-14 హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

తెనాలి: రాష్ట్ర అండర్-14 బాల, బాలికల హ్యాండ్‌బాల్ జట్లను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. ఎంపికైన జట్లు నవంబరు నెలాఖరులో చత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

బాలుర జట్టు ఇదే..

వల్లెపు హరీష్, యలగాల అనిల్, పచ్చ కార్తీక్, మాలిశెట్టి విజేష్ (గుంటూరు), బుక్కి గోవర్ధన్ నాయక్, బుస్సా సాయినాథ (చిత్తూరు), యర్రగుంట్ల దయాసాగర్, మొలకల చిరుత (ప్రకాశం), కడియం సంతోష్‌కుమార్, రవైన ఏసు, బొమ్మల యశ్వంత్ (కృష్ణా), ఆరిక చరణ్ (విజయనగరం), గురుగుబెల్లి సోమశేఖర్ (శ్రీకాకుళం), మామిడి గిరీష్‌కుమార్ (నెల్లూరు), కుంద్రపు నాగేంద్రసాయి (పశ్చిమ గోదావరి), కాశీనగరి హేమసుందర్ (కడప).

బాలికల జట్టు...

రమావత్ సింధూర, సంకురి హదస్సా, విస్సా జుహిత, తిరుమలశెట్టి నాగశ్రావ్య, గుండెగ బాల భవ్య (గుంటూరు), పఠాన్ సాఫియా, భవిరెడ్డి జాహ్నవి (కృష్ణా), గద్దం చందు, వాడపల్లి వర్షిత (ప్రకాశం), మావిళ్ల నిహారిక, వి.మోక్షిత (చిత్తూరు), షేక్ షహనాజ్ (కర్నూలు), నాగిరెడ్డి హారిక (విజయనగరం), సరిబాల కావ్య (కడప), దుంప ప్రసన్నకుమారి (శ్రీకాకుళం), కొత్తపల్లి శైలజ (అనంతపురం).

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్‌బాల్ అండర్-14, అండర్ -17 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఏఎంజీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. పోటీలను ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ పోటీలకు బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 256 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనపర్చిన క్రీడాకారుల నుంచి జిల్లాజట్లను ఎంపిక చేశారు. అండర్-14 బాలికల విభాగంలో 12 మందిని, బాలుర విభాగంలో 12 మందిని, అండర్ -17 బాలికల విభాగంలో 12 మందిని, బాలుర విభాగంలో 12 మందిని ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సురేష్ కుమార్, టోర్నమెంట్ అబ్జర్వర్‌లు రమాదేవి, షేక్ బాజి, ఏఎంజీ వైస్ ప్రెసిడెంట్ ఎడ్విన్‌పాల్, స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.